# ఎద్దడి నీళ్ళు

వ్రాసినకొద్దీ వ్రాతకూడా దారిద్ర్యం అబ్బిపోతుందేమో అనేభయంవేస్తూంది.
వ్రాస్తే వ్రాత సౌభాగ్యం అనుకుంటే ఒకముక్క వ్రాయవచ్చును.
కళ్ళల్లోకంటూ ఎటుచూచినా, చెవుల్లోకల్లా ఎటువిన్నా, వేడిగాడుపే.
"నీ కలా యుండాలని నాకోరికే. నీ వలాయుండాలని నాకోరికే."
ఇచ్చేస్తోందిగదా ఎందుకు తీసికోకూడదు అని వాని యూహ.
"ఏం తిరిగి పట్టుకొచ్చేవు? వెఱ్ఱిముండాకొడకా!" అంది యువతి.
"నీ యవ్వనం తగులబెట్ట చావలేకపోయేవు అనాడు" అన్నాడు లోపలికెళ్ళి.
"ఎద్దడినీళ్ళవడంచేత చావలేదు" అంది ఆమె అతినిబ్బరంగా.
ఊరంతా నుయ్యి బలికోరిందనుకొన్నారు.

ఒక ధర్మచావడి - ఒక యేఱు - అవే మన యీ కథకు గావలసినవి. మిగతాయూరంతున్నా యెక్కడున్నా మనకక్కర్లేదు. ఆ రెండూ మీ రానవాలు పట్ట గలిగినారా అంటే ఊరేదో తెలిసిపోయిందన్నమాటే. ఊరెంతుందో బోధపడ్డాదన్నమాటే. ఏమాఅంటే మన యీకథకు నాయకీనాయకులు ముష్టివాళ్ళు. వాళ్ళకు వేఱే ఇల్లూవాకిలీ లేదు. ధర్మచావడిలోనే బస. వాళ్ళకు మంచినీళ్ళకు ఆదరువు వేఱే నుయ్యా, చెరువూ ఏమీలేవు. దూరాన్నే ఓపుంతమ్మటే పోగా తగిలే పోల్నాటి సెలయేఱే ఆధారం. ఆయేటికీ యీచావడికీ మధ్యజరిగిన కథయిది. రెండోకంటివాడెఱుగనిదీ.

పుంతలో మొదటో వేపచెట్టు, ఆవేపచెట్టుదాటి ఓ మలుపుతిరిగితే మఱో వేపచెట్టు. అంతే చెట్లు. ఎక్కడన్నా బ్రహ్మదండిపొదలు. పుంతంతా గులకరాయీ, గండ్రడిసుకా, కాలం మండువేసంగి. వేళ మట్ట మధ్యాహ్నం

వాళ్ళిద్దరూ పుంతమ్మట పోతూవున్నారు. వాళ్ళనగా బిచ్చగాడూ, బిచ్చకత్తే. వాళ్ళకు పేర్లు లేవా అంటారేమో? బిచ్చగాళ్ళను బిచ్చంవేసీ వెయ్యడంలో పొమ్మనమనడమేగాని నీపేరేమిటి నీయూరేమిటి అనే వాకబు నాకెప్పుడూలేదు. నాకేకాదు. ఎవరికీవుండదనే నాయూహ. మనమేభాగ్యవంతుణ్ణయినా కలుసుకున్నామా అంటే వాని పుట్టుపూర్వోత్తరమంతా వాళ్ళవల్లా వాళ్ళవెనకాతలే నడిచేవాళ్ళవల్లా తెలిసికొంటేనేకాని తోచదు. ముష్టివాళ్ళనుగుఱించి అలా తెలిసికుందామని వుండదు. ఎంచేతో? అది లోకప్రకృతి అనుకోవాలి అంతే. లేకపోతే మనుష్యతత్వం అనుకోవాలి.

బిచ్చగాడూ బిచ్చకత్తే పుంతమ్మటే పోతూవున్నారు. బిచ్చకత్తె బుజాన్ని ఒకకుండవుంది బిచ్చగానిబుజాన్ని ఒక గడ్డపాఱవుంది. బిచ్చకత్తెకాళ్ళను తాటిపట్టలువిఱిచికట్టిన ఒక ఆకజోడు ఆకారంలాంటి జోడువుంది. బిచ్చగాడికాళ్ళని ఎవరికాళ్ళనో అరిగిపోయి పాఱేయగా దొరికిన పాతచెప్పులజోడొకటి వుంది. మిగిలిన వస్తువాహనాలు, వస్త్రలాంఛనాలూ దాన్నిబట్టి యూహిస్తేనే మంచిది. వ్రాసినకొద్దీ వ్రాతకూడా దారిద్ర్యం అబ్బిపోతుందేమో అనేభయం వేస్తూంది.—

వాళ్ళ నలావిడిచిపెట్టి ఒకడుగు ముందుకుపోదాం—ఒక అయినింటియువతి. పచ్చని శరీరచ్ఛాయ. పదారువన్నెకడాని ననుకరిస్తూవుంది. ఒంటిమీద ఒల్లె వీపుమొక్క సౌష్ఠవం చూపిస్తూవుంది. చేతుల కంక

జాలు, పోచీలు. కాళ్ళను కడియాలు, అందెలు. మెళ్ళో కంటె, నాను, పుస్తెలు బుజాన్నోయిత్తడిబిందె. ఇత్తడి బిందెలో ఒక ఇనపగరిటె. ఇనపగరిటె నల్లగా పైకి తనయొక్క మొన చూపిస్తూవుంది. ఆమె కాళ్ళని జోడూలేదు. ఆమె నెత్తిని గొడుగూలేదు. వెనుక చూపులేదు. వెడుతూవుంది ఏటివంకకే ఈ పెనుగులించి వ్రాయనక్కఱలేకుండానే చెప్పవచ్చును భాగ్యశీల అని. వ్రాస్తే వ్రాతలో భాగ్యం అనుకుంటే ఒక ముక్క వ్రాయవచ్చును. ఆమె యౌవనం బరాబరికి అప్పుడే వచ్చియుంటుందని వ్రాస్తే వ్రాయవచ్చును. తీండ్రపు యెండనే తియ్యనిచూపులు. వడగాడుపునే చల్లని యూరుపు. ఆమె కనక ఆమార్గాన్ని ముందునడుస్తూవుండక పోతే బిచ్చగాడూ బిచ్చకత్తె దారిలో ఆపాటికే జోషిల్లిపోయియుండురనుకోవాలి.

బిచ్చగాడామెను చూస్తూ అన్నాడు తనపెళ్ళాంతో 'ఓలేవు పోలీ! నీళ్ళుంటాయె, యేటిలో నీళ్ళుంటాయే. నేను తప్పక్కఱలేదనుకుంటానే' అన్నాడు. బిచ్చకత్తెఅంది 'ఏం?' అని. 'ముందు మనలాగే వెడుతున్నారుకదా జనం. నీళ్ళు లేకపోతే వెడతారనా నీయూహ?' అన్నాడు బిచ్చగాడు. 'అందాకా చేరే శక్తి ఉండొద్దు? మనకు ఉండొద్దు మనకు?' అంది బిచ్చకత్తె.

ఇంకా కొంచెంవడిగ్గానడుస్తున్నారు పేదజంపతులు. 'మన ముసిలిబాపనయ్యగారి పడుచుభార్యగారల్లే వున్నారే. మంచినీళ్ళుకావాలంటే సర్వం గొల్లకందా గొల్లకిటమ్మనేత పోయించుకోరాదంటే. ఇందాకా యీయెండలో నడచిరావడం ఎందుకే.—ఆలాఅమాటికొస్తే ఘనమేనయాం. కాళ్ళ కేపినుగుల్లోడో ఏతాటి పీచ్చో ఆధారంచేసుకొని నడుస్తున్నాము. ఆవిడ చిందులు తొక్కవలసివస్తోందే. ఇసకలో గండ్రిసకలో అయ్యోపాపం! నిలవనీడైనాలేదే. మనిద్దఱం ఏదన్నా ఉల్లభంలాగపడితే బాగుండిపోనే. నాకు చాలాజాలేసిపోతూందే, పోలీ! నాకు చాలాజాలేసిపోతూంది.' అన్నాడు బిచ్చగాడు.

పోలికాళ్ళను తాటిపట్టజోడు వడప తెగిపోయింది. పోలికి వడకొట్టింది. పోలి క్రిందపడిపోయింది. పోలియొక్క బుజాన్నివున్నకుండ నేలబడి చితికిపోయింది. బిచ్చగానికేమి చేయడానికి తోచలేదు కేకవేసిముందు పోయ్యేమనిషిని వెనక్కిపిలిస్తేమాత్రం లాభం ఏమిటి? ఆవిడబుజాన్ని వున్నది ఉత్తబిందే. ఆవిడ పోయేది ఏటికే. పోనీ తిరిగి ఆవిడవచ్చేదాకా కనిపెట్టుకూర్చుంటాడా బిచ్చగాడు? కూర్చుంటే ఆలోపునే నాలికార్చుకుపోయి పోలి ప్రాణంపోతుందేమో. పోనీ పటుకెట్టుకెడతాడనుకుందాం. దేనితో నీళ్ళు పట్టుకువస్తాడు? కుండ పగిలిపోయింది. కళ్ళల్లో కంటూ ఎటు చూచినా, చెవుల్లో కళ్ళా ఎటువిన్నా వేడిగాడుపే—ముందుకు రెండడుగులువెళ్లి రెండడుగులు వెనక్కివచ్చి పోలికేసి ఓమాటు చూచి మళ్ళీ ముందుకుసాగినాడు, ఎండిన సెలయేటి యిసక మిలమిలామంటూ ఇగబారెడులెక్కలో అనేటట్టుంది.

బ్రాహ్మణయువతి, యెండిపోయిన యేటియిసుకలో ఆయుదయంతీసిన చలమ మధ్యాహ్నానకెండిపోయిన కారణంచేత గరిటెతో యింకా తవ్వుతూ నీళ్ళయూట కోసం ఎదురుచూస్తూవుంది. చాలా వేడిగావుంది. చెమ్మటతోపాటు అదోవిధమైన మైకంకూడా కప్పివేస్తూ వుంది ప్రతీజీవరాశిని.

'పోలీ!' అని ఒక ఏసలో ఒకగట్టికేక వేసినాడు పిలిచినట్టుగా బిచ్చగాడు. బిచ్చగాడి బుజాన్నివున్న గునపం వాడిబుజాన్ని ఆలాగేవుంది. 'పోలీ' అని ప్రతిధ్వనించింది అంతరాళం. బ్రాహ్మణయువతికి పైప్రాణాలు పైకెగిరిపోయాయి. బిచ్చగాడనుకొన్నాడు—పైకి నాటకరంగస్థలంమీది స్వగతమంత గొంతెత్తి—'నీ కలాయుండాలనినాకోరికే-నీవలాయుండాలని నాకోరికే - ఆలావస్తువుపెట్టుకుని ఆలావగచుస్సు గలిగి ఆలా యౌవనం వెల్లగక్కుతూ ఆలా నివ్వుండాలని నాకోరికే - కాని నీజీవితం నాజీవితం భగ్నములైపోయినాయి. యీనాడు నీకు మంచినీరం మోసికొని పోవడానికి కుండకూడా లేకపోయెనే?' అని పెద్ద

పెట్టున నేడ్చినాడు.

బ్రాహ్మణయువతి గుండెలో రాయిపడింది. 'భగవానుడా! ఇంత ముసలిభర్త కొసయూపిరితో నున్నాడు. బిందెడు మంచినీళ్ళా వుదయం తెచ్చిన వుదయమే అయిపోయినయి సగంనీళ్ళు బిందెలోనే ఆర్చుకొనిపోయినవనవచ్చును. దాహము దాహమనువాని కింత దాహమిచ్చుటకైనా నోచకుండ వీ డీబిందెనెత్తుకొని పోడుగదా?' అని యేమేమొవాపోచి నిలువునా నిశ్చేష్టురాలై నిలుచుండిపోయింది. కొంతసేపు బిచ్చగాడు నిశ్శబ్దంలో లీనమైనట్టుండిపోయినాడు. ఆలోపున బ్రాహ్మణయువతి ఊరిన నీటిలో తన బిందెముంచి, పైకితీసిగట్టున పెట్టుకొన్నది.

'ఆనీళ్ళా ఆబిందె, నే నెత్తుకొనిపోయి నాభార్యను రక్షించుకొందు. నాభార్యను రక్షించుకొందు. నాభార్యను రక్షించుకొందు. తల్లీ!' అన్నాడు. 'తీసికోమంది' ఇల్లాలు. 'ఆవస్తువులు కావా' లన్నాడు బిచ్చగాడు. వలిచిఅక్కడపెట్టింది ఆవిడ. లేకపోతే చంపేస్తాడనే భయం—ఆమెకు.—ఇచ్చేస్తోందిగదా ఎందుకు తీసికోకూడదు అని వానియూహ. వాడు వాటిని తీసికొంటూ ఒకచూపుమాత్రంగా ఆయువతికేసిచూసి ఆపిల్ల బెదరిపోతూవుంటే వెఱ్ఱినవ్వు నవ్వుకుంటూ వెళ్ళిపోయినాడు.

భైక్షుకదంపతులూ ఆబిందే ఆవస్తువులూ తిరిగి ఎవరికీ ఎక్కడా పట్టుపడలేదు. కాని దొంగఎవడో ఆవిడ వస్తువులూ బిందే బలాత్కారంగా తీసికొనిపోయినాడని తెల్లమైంది.



..................................

కొన్నాళ్ళకు ముసలిమొగుడు అరుగుమీద కూర్చొనియుండగా బిచ్చగాడువచ్చి 'స్వామీ! మీ ఆవిడ ఆనాడు నాకిచ్చిన బిందే, వస్తువులు' అన్నాడు. 'ఏం తిరిగి పట్టుకొచ్చేవు, వెఱ్ఱిముండాకొడకా!' అంది యువతి అప్పటికి కొంచెం ఆరితేరిన గొంతు కవబట్టో ఇంటనుండబట్టో—'నాపోలి చచ్చిపోయింది. నాపోలి చచ్చిపోయింది. ఇంకెవరికి?' అని ఏడుస్తూపోయినాడు బిచ్చగాడు.

వృద్ధభర్త కేమనడానికీ పాలిపోలేదు. 'నీయవ్వనం తగులబెట్ట చావలేకపోయేవు ఆనాడు.' అన్నాడు లోపలకువెళ్ళి. 'ఎద్దడినీళ్ళవడంచేత చావలేదు' అంది ఆమె అతినిబ్బరంగా.—

ముసలిబాపనయ్య కుళ్ళికుళ్ళి చనిపోయినాడు. కాని ఆమెకు వర్చస్సు మాఱలేదు.—

కొన్నాళ్ళకు నడువీధిలో మంచినీళ్ళనుయ్యి తీయించేరు సర్కారువారు. నూతిప్రతిష్ఠయిననాటిరాత్రే ఆ బాపనవితంతువు అందులోపడి మృతిజెందింది. ఊరంతా నుయ్యి బలికోరిందనుకొన్నారు.

—కవికొండల వెంకటరావు, బి.ఏ. బి.ఎల్.